సాక్షి ప్రకాశం

ఆదివారం । 19 । మే । 2024



దర్శిలో హైడ్రామా

దర్శిలో టీడీపీ నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నారు. వివాదాస్పద వ్యాఖ్యలతో గొడవలు చెలరేగేలా చేస్తున్నారు. ఎక్కడి కక్కడ దాడులకు తెగబడుతున్నారు. - 8లో..



ఆటోను ఢీకొన్న మినీలారీ.. ఒకరు మృతి

పొదిలి మండలం కంభాలపాడు వద్ద ఆటోను మినీలారీ ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36.3/26.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పిడుగు పడి వ్యక్తి మృతి



మృతి చెందిన నారాయణ

త్రిపురాంతకం: గాలి వాన బీభత్సానికి పిడుగులు పడటంతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో పాటు విద్యుత్ వైర్లు తెగి విద్యుత్ సరఫరా నిలిచింది. దాంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. త్రిపురాంతకం మండలం డీవీఎన్ కాలనీకి చెందిన అలగసాని నారాయణ (32) మృతి చెందాడు. అదేవిధంగా కంకణాలపల్లి గ్రామానికి చెందిన పేరయ్య గేదె పిడుగుపాటుకు మృతి చెందింది. అదే గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు నేలకొరిగాయి. త్రిపురాంతకంలో చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

రూ.311 పలికిన పొగాకు ధర

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు పొగాకు బోర్డు రీజియన్ పరిధిలో ఈ సీజన్‌లో వేలం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు శనివారం గరిష్టంగా పొగాకు కేజీ రూ.311 పలికినట్లు టుబాకో బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. శనివారం వరకు 2,05,996 పొగాకు చెక్కలను వేలం పాట ద్వారా బయ్యర్లు కొనుగోలు చేశారని చెప్పారు. గరిష్టంగా కేజీ రూ.311, కనిష్టంగా రూ.211 పలికినట్లు చెప్పారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగించుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి



విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను ఉపయోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి కోరారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ చదువుతో పాటు వేసవి విజ్ఞాన శిబిరాల్లో పిల్లలకు పలు రకాలైన కళల్లో సైతం ఉచితంగా శిక్షణ ఇస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కవి జాలాది మోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం కోసం నిర్వహించే ప్రేరణ తరగతుల్లో మంచి పుస్తకాలు చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, సీహెచ్ సుధాకర్, మంచికంటి వెంకటేశ్వర రెడ్డి, మరో గ్రంథాలయ ఉద్యమం వారు పిల్లలతో పుస్తక పఠనం, ఇంటరాక్షన్, మోటివేషన్ ఆఫ్ రీడింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పీ పేరయ్య, గ్రంథాలయ సిబ్బంది డీ సందీప్, పీ ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన పోస్టల్ బ్యాలెట్‌లు



పోస్టల్ బ్యాలెట్ ఓట్లను రిసీవ్ చేసుకున్న అధికారులు

ఒంగోలు అర్బన్: ఎన్నికల విధుల్లో మన జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులకు సంబంధించిన ఆయా జిల్లాల్లో ఓటు వేసిన పోస్టల్ బ్యాలెట్‌లు శనివారం జిల్లాకు చేరాయి. ఒంగోలు పార్లమెంట్ ప్రత్యేక అధికారి ఝన్సీ, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి విశ్వేశ్వరరావు జిల్లాకు వచ్చిన పోస్టల్ బ్యాలెట్‌లను స్పందన హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో రిసీవ్ చేసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ల సీళ్లు తీసి జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా విభజించారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్‌లను ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్ రూములకు తరలించారు. ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్లు పార్లమెంట్ నియోజకవర్గానికి 2330 ఓట్లు, అసెంబ్లీ నియోజకవర్గాలకు 2343 ఓట్లు వచ్చాయి. దీనిలో ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, వైఎస్‌ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, రాజశేఖర్, స్వరూప్, అభ్యర్థులు రాయపాటి జగదీష్, కొండారెడ్డి, యోహాన్, కోటేశ్వరరావు, డీ బాలాంజనేయులు, హరిప్రసాద్, ఏడుకొండలు, శ్రీకాంత్, ఆమని తదితరులు పాల్గొన్నారు.

నేనున్నానంటూ..

ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. ఎలాంటి కష్టం వచ్చినా నేనున్నానంటూ రైతుల చేయి విడవడంలేదు. ఏ సీజన్‌లో ఏర్పడిన నష్టాన్ని అదే సీజన్‌లో ఇస్తూ ఆదుకుంటున్నారు. అదే రీతిలో ఎన్నికల ముందే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సైంధవుడిలా అడ్డంపడ్డాడు. ఎన్నికల కమిషన్‌ను అడ్డంపెట్టుకుని కుట్రలు చేశాడు. పోలింగ్ ముగిసిందే ఆలస్యం జిల్లాలో 3775 మంది రైతులకు ఇవ్వాల్సిన రూ.2.82 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ నగదు రైతుల ఖాతాల్లో జమచేసి రైతు పక్షాన సీఎం జగన్ నిలిచారు.



దెబ్బతిన్న మిరపను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ (ఫైల్)

- విపత్తు కష్టంలో రైతుకు వెన్నుదన్నుగా నిలిచిన సీఎం జగన్
- ఎన్నికలు అడ్డంపెట్టుకుని సాయం అందకుండా అడ్డుకున్న చంద్రబాబు
- పోలింగ్ ముగిసిన వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ
- 3775 మంది రైతులకు రూ.2.82 కోట్లు జమ
- రెండు రోజుల పాటు ఖాతాల్లోకి నగదు
- ఆనందంలో అన్నదాతలు

ఒంగోలు సెంట్రల్: తుపాన్‌లతో నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో పరిహారం అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. గడిచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో మొదటి రోజు నుంచి చివరి వరకు ఇదే పద్ధతిలో బాధిత అన్నదాతలకు బాసటగా నిలుస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో మిచాంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు కూడా సీజన్ ముగియకుండానే పరిహారం జమ చేసేందుకు సిద్ధమైన ప్రభుత్వం తేదీలను కూడా ప్రకటించింది. అయితే చంద్రబాబు నాయుడు ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని రైతులకు పరిహారం అందకుండా అడ్డుకున్నాడు. అయినా సరే సీఎం వైఎస్ జగన్ వారి కుయుక్తులను బహిరంగ సభల్లో విమర్శించి రైతన్నలకు ఆదుకోవటానికి ఎన్నికలు ముగిసిన వెంటనే నష్టపరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం జిల్లాలో శనివారం, సోమ, మంగళవారాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

నాడు చంద్రబాబు పాలనలో ..

చంద్రబాబు పాలనలో తుఫాన్‌లు వస్తే రైతులు వణికిపోయేవారు. పంట దెబ్బతింటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగేవారు. తెలుగు తమ్ముళ్లు చెప్పిన రైతుల పేర్లతోనే జాబితా తయారయ్యేది. నష్టం అంచనాలు రూపొందించాక సీజన్లు గడిచిపోయినా పరిహారం అందుకోవటం గగనమయ్యేది. ఏడాదికో.. ఎడాదిన్నరకో పరిహారం విడుదలైనా పది నుంచి 20 శాతం జన్మభూమి కమిటీలకు కమీషన్ ముట్టచెప్పాల్సి వచ్చేది. ఎన్నికలకు ముందు మొక్కుబడిగా పసుపు కుంకుమ, పింఛన్‌లు పెంచేవారు.

నేడు...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తుఫాన్‌లు వచ్చినా రైతులు నిశ్చింతగా ఉంటున్నారు. టీడీపీ ప్రభుత్వానికి భిన్నంగా పూర్తి పారదర్శకంగా పంట నష్టం అంచనాలు రూపొందిస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. ప్రతి రైతు పంట చేనుకు వెళ్లి ఫొటోలు తీసి జాబితాను రూపొందిస్తున్నారు. జాబితాలో లోపాలుంటే సరిదిద్దేందుకు వీలు కల్పిస్తున్నారు. సామాజిక తనిఖీ తర్వాతే తుది జాబితా విడుదలవుతోంది. ప్రభుత్వానికి వెంటనే నివేదికలు పంపుతున్నారు. సీజన్ దాటక ముందే పంట నష్ట పరిహారాన్ని రైతులకు అందించి రైతులను ఆదుకుంటున్నారు. దీంతో అన్నదాతలు సీఎంకు జేజేలు చెబుతున్నారు.

గతంలోను ఆదుకున్న వైనం ఇలా...

2019 ఆగస్టులో, అక్టోబర్‌లలో సంభవించిన భారీ వర్షాలకు, 2020 జనవరి, ఫిబ్రవరి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్, నివార్ తుఫాన్ నష్టాలకు, 2021లో నవంబర్‌లో 2020 సెప్టెంబర్‌లో, 2022 డిసెంబర్‌లో మాండూస్ తుఫాన్, 2023 మార్చిలో అకాల వర్షాలకు సంభవించిన నష్టాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్పందించి ఇన్‌పుట్ సబ్సిడీ అందించారు. ఎన్నికల అనంతరం మిచాంగ్ తుఫాన్ ఇన్‌పుట్ సబ్సిడీ సైతం అందించటానికి సిద్ధమయ్యారు.

రైతులను ఎప్పటికప్పుడు ఆదుకున్న ప్రభుత్వం



రైతులకు నాలుగన్నరేళ్ల కాలంలో అతివృష్టి, అనావృష్టిలు సంభవించినప్పుడు సరైన సమయంలో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా చేయూతనిచ్చి ఆదుకుంది. 1,87,691 మంది రైతులకు రూ.14.92 కోట్లు అందించింది. మిచాంగ్ తుఫాన్ ఇన్‌పుట్ సబ్సిడీ రూ.282.320 లక్షలు సైతం రైతుల ఖాతాల్లో నేరుగా రెండు రోజుల పాటు జమకానున్నాయి.

– ఎస్ శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

ఐదేళ్లుగా ఇన్‌పుట్ సబ్సిడీ అందించిన వైనం ఇలా..

సంవత్సరం	నష్టపోయిన రైతులు	ఎకరాలు	విలువ (లక్షల్లో)
2019	1510	2,197.4	55.49
2020	1,34,623	2,30,876.05	1,0338.12
2021	18,715	29,966.82	1647.57
2022	28,727	63,147.08	2563.41
2023	341	606.52	34.77
2023 మిచాంగ్	3775	4,975.9	282.32
మొత్తం	1,87,691	3,31,769.77	14921.67

పంట నష్టపోయిన వివరాలు ఇలా ...

పంట	నష్టపోయిన పంట విస్తీర్ణం	రైతుల సంఖ్య	ఇన్‌పుట్ సబ్సిడీ రూ.లక్షల్లో
వరి	2799.2	2584	190.34
జొన్న	518.52	394	25.93
కంది	4.15	1	0.17
అలచందలు	12.5	3	0.50
మినుము	817.37	492	32.7
పొగాకు	749.4	266	29.98
వేరుశనగ	5	1	0.34
నువ్వులు	69.75	34	2.37
మొత్తం	4975.9	3775	282.32

నియోజకవర్గాల వారీగా అందిన నష్ట పరిహారం ఇలా..

నియోజకవర్గం	విస్తీర్ణం ఎకరాల్లో	రైతుల సంఖ్య	ఇన్‌పుట్ సబ్సిడీ రూ.లక్షల్లో
దర్శి	510.57	360	33.49
గిద్దలూరు	360.87	287	22.16
కనిగిరి	219.8	189	14.67
కొండపి	2	1	0.10
మార్కాపురం	402.62	631	27.37
ఒంగోలు	129.62	55	5.185
ఎస్.ఎన్.పాడు	1647.2	834	69.20
వై.పాలెం	1703.17	1418	110.11
మొత్తం	4975.9	3775	282.320

నూతన అధ్యాయానికి శ్రీకారం



గతంలో ఎప్పుడూ పాలకులు తమ పాలనలో సైతం ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత లేదు. అయితే అందుకు భిన్నంగా ఎన్నికలు ముగిసినా సరే రైతన్నలకు, మహిళలకు, విద్యార్థులకు ముందే ఇస్తామన్న ఇన్‌పుట్ సబ్సిడీ, చేయూత, విద్యాదీవెన నగదు ఎన్నికలు ముగిసిన అనంతరం కూడా ఇవ్వటం రాజకీయాల్లో నూతన అధ్యాయం. సీఎం వైఎస్ జగన్‌కు ఆయా వర్గాలపై ఉన్న ప్రేమకు ఇది మచ్చుతునక. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రైతులు ఎంతో ధైర్యంగా వ్యవసాయం చేశారు. పండితే పంట ఇంటికి వస్తుంది. ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు జరిగిన సమయంలో ఏ సీజన్‌లో పంటకు ఇబ్బంది అయితే అదే సమయంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంతో పాటు ఉచిత పంటల బీమాను అమలు చేసి రైతులను ఆదుకున్నారు. మిచాంగ్ తుఫాన్ ఇన్‌పుట్ సబ్సిడీ సైతం ఎన్నికలకు ముందు ఇవ్వాల్సి ఉండగా, కూటమి పరోక్షంగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఆపివేయించారు. ఎన్నికలు ముగిసినా సరే ప్రభుత్వ రైతుల ఖాతాల్లో డీబీటీ ద్వారా పంపటం జగనన్న ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం.

– మారెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు



జిల్లా జైలులో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి

జిల్లా జైలు పరిశీలన

- జైలును పరిశీలించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ భారతి

ఒంగోలు: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు శనివారం జిల్లా జైలును సందర్శించారు. ఖైదీలకు ఏర్పాటు చేసిన వసతులు, సదుపాయాలు, పరిశుభ్రత వంటి అన్ని అంశాలను పరిశీలించారు. ఎండ తీవ్రతను అధిగమించేందుకు ఖైదీల బ్లాకుల్లో ఏర్పాటు చేసిన వట్టివేరు చాపలు, మంచినీటి కుండలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను, ఖైదీలకు అందుతున్న ఆహార సదుపాయాలను పరిశీలించారు. ఖైదీల కోసం వండిన పదార్థాల నాణ్యత, పరిమాణాలు, దుస్తులు, దుప్పట్ల నాణ్యతను, పరిసరాల శుభ్రత, తాగునీటి పరిశుభ్రతను నిశితంగా పరిశీలించారు. ఖైదీల ఆరోగ్య వివరాలను కారాగారం వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న ఉచిత న్యాయ సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైళ్లశాఖ నిర్వహిస్తున్న పెట్రోల్ బంకును పరిశీలించి అందులో పనిచేస్తున్న జీవిత ఖైదీలను పరామర్శించారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి పి.వరుణ్‌రెడ్డి, జైలు వైద్యాధికారి కేఎస్‌వీఎస్ బ్రహ్మతేజ, జైలర్ వి.రమేష్, ఎం.శ్రీనివాసరావు, డిప్యూటీ జైలరు బి.శ్రీనివాసరావు, కేవీ వసంతరావు, సిబ్బంది ఉన్నారు.

పాల్ ల్యాబ్ ట్యాబులను వినియోగించుకోవాలి

- పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్

ఒంగోలు: పాల్ ల్యాబ్ సౌకర్యం ఉన్న పాఠశాలల్లో పాల్ ల్యాబ్ ట్యాబులను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పాల్ ల్యాబ్‌లు ఉన్న 72 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాలకు సంబంధించి మరో ఇద్దరు ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల్ ల్యాబ్ ఆవశ్యకత, వాటిని విద్యార్థులు వినియోగించుకునేలా చేయడంపై ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయి అవగాహన ఉండాలన్నారు. తద్వారా మంచి ఫలితాలు సాధించగలుగుతామని చెప్పారు. డీఈవో డి.సుభద్ర మాట్లాడుతూ పాల్ ట్యాబులను విద్యార్థులు ఎక్కువ సమయం సద్వినియోగం చేసుకోవాలని, పాఠశాలల ప్రగతిని సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి కిషోర్, సమగ్రశిక్ష మాధవీలత తదితరులు పాల్గొన్నారు.



పాల్‌ల్యాబ్ రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో

వాహనాలకు మాత్రమే పెట్రోలు, డీజిల్ విక్రయించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు జిల్లాలోని పెట్రోలు బంకుల నిర్వాహకులు జూన్ 10వ తేదీ వరకు కేవలం వాహనాలకు నింపేందుకు మాత్రమే పెట్రోలు, డీజిల్ విక్రయించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పెట్రోలు, డీజిల్ ఎట్టి పరిస్థితిలోను సీసాలకు, డ్రమ్ములకు, ఇతర పాత్రలకు సరఫరా చేయకూడదన్నారు. అలా చేస్తే షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో పెట్రోలు బంకులపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా గమనించి కేవలం వాహనాలకు మాత్రమే పెట్రోలు, డీజిల్ పట్టించుకుకోవాలన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి

- ఎరువులు, విత్తనాలు నిర్ణీత ధరలకు విక్రయించాలి
- జిల్లా వ్యవసాయశాఖ జేడీఏ ఎస్ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీఏ శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ డీలర్లు నియమ నిబంధనలు పాటించి నిర్ణయించిన ధరలకు అమ్ముకోవాలని జిల్లా వ్యవసాయశాఖ జేడీఏ ఎస్ శ్రీనివాసరావు అన్నారు. ఒంగోలు వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లకు సమావేశం ఏడీఏ రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయశాఖ జేడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువుల దుకాణాల లైసెన్సులు పొందగోరు డీలర్లు తప్పనిసరిగా తగిన విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు. పొందిన లైసెన్సు రైతులకు కనిపించేలా దుకాణంలో పారదర్శకంగా ఉంచాలని అన్నారు. స్టాక్, బిల్లు రిజిస్టర్లు సంబంధిత అధికారిచే ధ్రువీకరించుకోవాలని చెప్పారు. కంపెనీ ఫామ్–ఓ ఎప్పటికప్పుడు లైసెన్స్‌లో నమోదు చేసుకుంటూ ఉండాలన్నారు. ఎరువుల బస్తాలు తూకం కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని, ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువ అమ్మటానికి లేదని స్పష్టం చేశారు. వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే యూరియాను వ్యవసాయేతర, పారిశ్రామిక అవసరాలకు విక్రయించకూడదన్నారు. రైతులు వారు సాగు చేయటానికి ఎంత యూరియా అవసరమో తెలుసుకుని అంత మొత్తం మాత్రమే అమ్మాలని ఆదేశించారు. అమ్మిన ప్రతి బస్తాకు కచ్చితంగా ఎప్పటికప్పుడు ఐఎఫ్‌ఎంఎస్, డీబీటీలో నమోదు చేయాలన్నారు. ప్రతి నెలా మూడో తేదీ లోపు మీ వ్యాపారాలకు సంబంధించిన స్టాక్ రిపోర్టులను సంబంధిత మండల వ్యవసాయాధికారికి అందజేయాల్సి ఉంటుందని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు విక్రయించేవారు లైసెన్సులు కలిగి ఉండాలని చెప్పారు. గోడౌన్ వద్ద స్టాకు వివరాలు ప్రదర్శించాలని, విత్తన సంచులు లేదా ప్యాకెట్స్‌పై పూర్తి సమాచారం ఉండాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా హెచ్‌టీ పత్తి విత్తనాలు అమ్మరాదన్నారు. రాబోవు ఖరీఫ్, రబీలో తగిన జాగ్రత్తలు పాటించి రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించాలని కోరారు. టెక్నికల్ వ్యవసాయాధికారి వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఒంగోలు ఏడీఏ రమేష్ బాబు మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అమ్మే సమయంలో కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని చెప్పారు. ఎరువుల డీలర్ల సంఘ అధ్యక్షుడు దేసు వీరయ్య, ఆయా మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి


సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- ప్రణాళికాబద్ధంగా సమన్వయంతో పనిచేయాలి
- అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఈ నెల 24వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్, పదో తరగతి పరీక్షలను, జూన్ 1వ తేదీ నుంచి జరగనున్న ఏపీ ఓపెన్ స్కూల్స్, ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శనివారం ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షల సమయాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 15,291 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం పరీక్షలకు 7,075 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఎంపిక చేసిన 43 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12-45 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షలకు 22 పరీక్ష కేంద్రాల్లో 3,871 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

అదేవిధంగా ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇంటర్‌కు పది పరీక్ష కేంద్రాల్లో 2,612 మంది, పదో తరగతి పరీక్షలకు 6 కేంద్రాల్లో 898 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ అవకాశం లేకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. అధికారులు ప్రణాళికతో సమన్వయంతో పనిచేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, డీఈఓ సుభద్ర, ఆర్ఐఓ సైమన్ విక్టర్, డీఎంహెచ్‌ఓ సురేష్, ఆర్టీసీ, విద్యుత్, తపాలా, ఖజానా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దర్శిలో హైడ్రామా..!

- రక్తి కట్టిస్తున్న టీడీపీ నేతలు, పోలీసులు
- పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని విమర్శలు చేసేదీ టీడీపీ నేతలే
- రెచ్చగొట్టి దాడులు చేసిందీ వాళ్లే
- తాజాగా కూడా బొట్లపాలెంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ
- సమన్వయంతో ఉన్న బొట్లపాలెం వైఎస్సార్ సీపీ నేతలు
- ఇరువర్గాలు కొట్టుకున్నా.. బొట్లపాలెం గురించి మాత్రమే ప్రెస్‌మీట్ పెట్టిన టీడీపీ
- వైఎస్సార్ సీపీ నేతలు, పోలీసులపై జరిగిన దాడులపై నోరెత్తని వైనం
- దర్శిలో రాళ్లు రువ్విన కేసు, దేవవరంలో కర్రలతో దాడి ఘటన ఊసే లేదు
- పోలీసులను బూతులు తిట్టినా మిన్నకుండిపోయిన ఖాకీలు
- ఇదంతా టీడీపీ నేతలు – పోలీసుల హైడ్రామా అంటున్న ప్రజలు

దర్శి: దాడులు చేసింది వాళ్లే. రెచ్చగొట్టేదీ వాళ్లే. మళ్లీ వచ్చి బూతులు తిట్టి ప్రెస్‌మీట్‌లు పెట్టి పోలీసులను తిట్టేదీ వాళ్లే. టీడీపీకి పోలీసుల మద్దతును కప్పిపుచ్చేందుకు ఆ పార్టీ జిల్లా నేతలు దర్శి వచ్చి హైడ్రామా ఆడి వెళ్లారు. బాధితులను పరామర్శించే పేరుతో పోలీసులను, వైఎస్సార్ సీపీ నేతలను బూతులు తిట్టి హైడ్రామాను రక్తి కట్టించారు. బొట్లపాలెంలో ఇరువర్గాలు ఒకరికొకరు దాడులు చేసుకున్నారు. అయితే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ శుక్రవారం ఒంగోలు నుంచి బొట్లపాలెం వచ్చి టీడీపీ నాయకులను పరామర్శించే వంకతో మళ్లీ రెచ్చగొట్టి వెళ్లారు. పరామర్శించి గొడవలు లేకుండా చూడాల్సిన బాలాజీ.. వారిని రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడారు. మళ్లీ ఇలాగే జరిగితే వైఎస్సార్ సీపీ వాళ్లకు ఒక్కొక్కరికి తోలు తీస్తామంటూ రెచ్చగొట్టారు. రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామంటూ ఓవరాక్షన్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులను రాక్షస జాతి అని అవమానించారు. గ్రామంలోకి వచ్చి ఎన్నిమాటలు అన్నా.. బూతులు తిట్టినా.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా వైఎస్సార్ సీపీ నేతలు మాత్రం సంయమనం పాటించి ఓర్పుగా ఉన్నారు. పోలీసులు తప్పుడు కేసులు పెట్టుకుంటే పెట్టుకోండి.. ఒల్లు బలిసిన చేష్టలు చేస్తే డోంట్ కేర్.. తగిన మూల్యం చెల్లించుకోవాలని పోలీసులకు నూకసాని బాలాజీ వార్నింగ్ ఇచ్చారు. నాటకాలొద్దు, వేషాలు వెయ్యొద్దు, ఇలాగే చేసి ఎస్పీలు, కలెక్టర్లు సస్పెండ్ అయ్యారు, ఇక్కడ మీరు కూడా సస్పెండ్ అవుతారు ఖబడ్దార్ అంటూ పోలీసులను హెచ్చరించారు. ఈ తతంగమంతా తెలిసి కూడా వీడియోలు బయటకు వచ్చినా నూకసాని బాలాజీపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం టీడీపీ వారితో పోలీసులకు ఉన్న లాలూచీని స్పష్టం చేస్తోంది.


బొట్లపాలెంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ

ఖబడ్దార్ అంటూ పోలీసులను వీధిరౌడీలా రెచ్చగొట్టినా.. బాలాజీపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, కనీసం నోరు మెదపకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

పోలీసులే హైడ్రామా వేయించారనే అనుమానాలు...

జరిగిందంతా చూస్తుంటే నూకసాని బాలాజీతో పోలీసులే హైడ్రామా క్రియేట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బొట్లపాలెం గ్రామంలో ఇరువర్గాల వారు కొట్టుకున్నారు. ఇద్దరికీ దెబ్బలు తగిలాయి. దీంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. కానీ, దేవవరంలో టీడీపీ అభ్యర్థి భర్త లలిత్‌సాగర్ గొడవలు జరిగేటప్పుడు పక్కనే ఉన్నారు. టీడీపీ వారిని రెచ్చగొట్టారు. అయినా లలిత్‌సాగర్‌పై ఎటువంటి కేసులు పెట్టలేదు. దర్శి పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం బూత్‌లో జరిగిన ఘటనను పరిశీలిస్తే పోలీసుల పచ్చపాతం ఇట్టే అర్థమవుతోంది. ఎస్సై కళ్లెదుటే సమయం ఆరుగంటలు దాటిన తర్వాత పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఈవీఎంలు ఎత్తుకెళ్లేందుకు నరసరావుపేట రౌడీల సాయంతో టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ప్రయత్నించారు. అక్కడున్న ఓటర్లు పోలీసులకు చెప్పినా.. పోలీసులు మాత్రం వారిని అడ్డుకోలేదు. బలవంతంగా 6 గంటలు తర్వాత అభ్యర్థి లక్ష్మి, కడియాల వెంకటేశ్వరరావు, కడియాల లలిత్‌సాగర్, గొట్టిపాటి భరత్ పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించినా వారిపై ఎటువంటి కేసులు పెట్టలేదు. అసలు నరసరావుపేటకు చెందిన వ్యక్తులపై పోలీసులు ఎందుకంత ప్రేమ చూపిస్తున్నారన్న విషయం పలు అనుమానాలకు తావిస్తోంది. దగ్గరుండి టీడీపీ కార్యకర్తలతో పోలీసులపై, పోలింగ్ బూత్‌పై రాళ్లు రువ్వించిన వారిపై ఎటువంటి కేసులు పెట్టకపోవడం ఏంటని స్థానికంగా చర్చ నడుస్తోంది. నూకసాని బాలాజీ మాత్రం టీడీపీ నేతలపై కేసులు పెట్టారంటూ ఒక్క బొట్లపాలెం గురించి మాట్లాడారేగానీ.. వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు చేసిన దేవవరం గురించిగానీ.. పోలీసులపై, పోలింగ్ బూత్‌పై రాళ్లు రువ్విన ఘటనలపైగానీ నోరుమెదపలేదు. దేవవరం, దర్శిలో జరిగిన ఘటనల్లో ప్రధాన నాయకులపై, నరసరావుపేట రౌడీలపై ఒక్క కేసు కూడా పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు పోలీసులు వారిపై కేసులు ఎందుకు పెట్టలేదన్న దానిపై అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. నరసరావుపేటకు చెందిన రౌడీలకు ఇక్కడి పోలీసులకు సంబంధం ఏంటనే ప్రశ్నలు వెంటాడుతున్నాయి. సిట్ దర్యాప్తు చేపడితేనే ఇక్కడ జరిగిన లోగుట్టు బయటకు వస్తుందని ప్రజలు కోరుతున్నారు.

సూపర్ మార్ట్‌లో చోరీ


మార్ట్‌లోకి ప్రవేశించిన దొంగ (సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దృశ్యం)


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

- నగదు, వస్తువుల అపహరణ

కంభం: పట్టణంలోని ఓ సూపర్ మార్ట్‌లో దొంగలు పడి నగదు, నిత్యావసర వస్తువులు అపహరించుకెళ్లిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అనంతపురం – అమరావతి హైవే ఆనుకుని రావిపాడు రోడ్డు సమీపంలో ఉన్న సిందూరి సూపర్ మార్ట్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి షట్టర్‌ను గడ్డపారతో పైకి లేపి లోపలికి ప్రవేశించాడు. కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.80 వేల నగదు, నిత్యావసర సరుకులు, తినుబండారాలు, సీసీ కెమేరాలకు సంబంధించిన డీవీఆర్, హార్డ్ డిస్క్ అపహరించుకెళ్లాడు. ఉదయం మార్ట్ తెరవడానికి వచ్చిన సిబ్బంది షట్టర్ తెరిచి ఉండటం చూసి పోలీసులకు సమాచారం అందించారు. మార్ట్‌లోపల రెండు సీసీ కెమేరాలు ఉండగా లోపలికి ప్రవేశించిన దొంగ ఒక సీసీ కెమెరాకు సంబంధించిన డీవీఆర్, హార్డ్ డిస్క్‌ను అపహరించుకెళ్లగా మరో సీసీ కెమెరాకు చెందిన హార్డ్ డిస్క్‌లో దొంగ లోపలికి ప్రవేశించిన దృశ్యాలు, మార్ట్‌లోపల తిరుగుతున్న దృశ్యాలు నమోదయ్యాయి. స్థానిక ఎస్సై పులి రాజేష్ మార్ట్‌ను పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ బృందం మార్ట్‌లో వేలిముద్రలు సేకరించింది. నగదు, పోయిన వస్తువులు కలిపి సుమారు లక్షన్నర రూపాయలు ఉంటాయని మార్ట్ యజమాని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే వ్యాపార కూడలిలో ఉండే మార్ట్‌లో దొంగతనం జరగడంతో చుట్టుపక్కల వ్యాపారస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

చేపల చెరువులో విష ప్రయోగం

- చనిపోయి నీటిపై తేలియాడుతున్న చేపలు
- రూ.4 లక్షల నష్టం

పెద్దదోర్నాల: చేపల చెరువులో విష ప్రయోగం జరిగి చెరువులోని చేపలన్నీ మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని ఎగువ చర్లోపల్లిలో చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన శనివారం వెలుగుచూసింది. చెరువులోని చేపలన్నీ చనిపోవడంతో సుమారు రూ.4 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని యజమాని భోరున విలపించాడు. ఆ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై అంకమరావు కథనం మేరకు.. ఎగువచర్లోపల్లి కొత్తపాలేనికి చెందిన పరిశపోగు ఇశ్రాయేల్‌కు గ్రామంలో 2 ఎకరాల 75 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. రెండు ఎకరాల్లో జామ సాగు చేస్తుండగా, మరో 75 సెంట్లలో చేపల చెరువును గత ఎనిమిది నెలల క్రితం ఏర్పాటు చేసి చేపలు పెంచుతున్నాడు. ఈ నెల 16వ తేదీ వేకువజామున చెరువు దగ్గరకు వెళ్లి చూడగా, చేపలు మొత్తం చనిపోయి నీటిపై తేలుతూ కనిపించాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంకమరావు తెలిపారు. చనిపోయిన చేపల శ్యాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపనున్నట్లు ఎస్సై తెలిపారు. కొందరు గ్రామస్తులపై బాధితుడు అనుమానం వ్యక్తం చేయడంతో ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


చెరువులో చనిపోయి తేలియాడుతున్న చేపలు

ఆటోను ఢీకొన్న మినీ లారీ..ఒకరు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ కోటయ్య


దెబ్బతిన్న ఆటో

- ముగ్గురికి గాయాలు

పొదిలి: ఎదురుగా వస్తున్న ఆటోను మినీ లారీ ఢీకొనటంతో ఆటోలో ఉన్న వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఒంగోలు–గిద్దలూరు రహదారిపై పొదిలి మండలం కంభాలపాడు సమీపంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నంద్యాలకు చెందిన రమాదేవి, ఇద్దరు కుమారులు మధురోహిత్, అరుణ్‌కుమార్, కోడలు పుష్పాలు కలిసి విజయవాడ కనక దుర్గమ్మ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో నంద్యాల వెళుతున్నారు. ఈ క్రమంలో ఆటో కంభాలపాడు సమీపంలోకి వచ్చేసరికి పొదిలి వైపు ఎదురుగా వస్తున్న మినీలారీ ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో దెబ్బతిని ఆటోలో ఉన్న మధు రోహిత్ (21) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న రమాదేవి, కుమారుడు అరుణ్‌కుమార్, కోడలు పుష్పకు గాయాలయ్యాయి. అరుణ్‌కుమార్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, పుష్పకు ఎడమ కాలు, చేయి విరిగింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానికులు పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అరుణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కోటయ్య సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన మినీ లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

గ్యాస్ ఏజెన్సీలో చోరీ


దొంగతనానికి గురైన గ్యాస్ ఏజెన్సీ ఆఫీసు

కొమరోలు: కొమరోలులోని చెక్‌పోస్టు వద్ద ఉన్న ఓ గ్యాస్ ఏజెన్సీలో దొంగతనం జరిగింది. స్థానిక ఎలీషా ఇండియన్ డీవీకే గ్యాస్ ఏజెన్సీలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో దొంగతనం జరిగింది. శనివారం ఉదయాన్నే నిర్వాహకులు ఏజెన్సీ ఆఫీసును తెరవడానికి రాగా ఆఫీసు షట్టర్ గడ్డపార సహాయంతో పైకి ఎత్తి గ్లాసు అద్దాలను పగులగొట్టి లోపలికి చొరబడి దొంగతనం చేసినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏజెన్సీ ఆఫీసులో గ్యాస్ కౌంటర్‌లో ఉన్న రూ.10 వేల నగదు చోరీకి గురైనట్లు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

వీధికుక్కల దాడిలో 30 మేకపిల్లలు మృతి


మృతిచెందిన మేకపిల్లలు

అర్ధవీడు (బేస్తవారిపేట): వీధికుక్కల దాడిలో 30 మేకపిల్లలు మృతి చెందిన సంఘటన మండలంలోని అంకభూపాలెంలో జరిగింది. చింతలపూడి నాగేశ్వరరావుకు చెందిన మేకపిల్లల దొడ్డిపై వీధి కుక్కలు దాడి చేశాయి. 30 మేకపిల్లలు తీవ్రంగా గాయపడగా, పశువైద్యాధికారి బీ శ్రీధర్‌కు నాగేశ్వరరావు సమాచారం అందించారు. మేక పిల్లలకు వైద్యం చేసినా ఫలితం దక్కలేదు. వాటి మృతితో రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశాడు.

రోడ్డు ప్రమాదంలో కాంట్రాక్టు ఉద్యోగి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుధాకర్

తర్లుపాడు: తర్లుపాడు మండలం సీతానాగులవరం వద్ద శనివారం ఉదయం బైకును బొలేరో వాహనం ఢీకొన్న సంఘటనలో బేస్తవారిపేట టైలర్స్ కాలనీకి చెందిన మహబూబ్ సుభానీ (31) మృతి చెందాడు. ఎస్సై వేముల సుధాకర్ కథనం ప్రకారం.. సుభానీ శనివారం ఉదయం మార్కాపురం పట్టణంలో పనిముగించుకుని తన టూ వీలర్‌పై బేస్తవారిపేటకు తర్లుపాడు మీదుగా బయలుదేరాడు. సీతానాగులవరం గ్రామం వద్దకు రాగానే అతి వేగంతో వచ్చిన బొలేరో వాహనం సుభానీ టూ వీలర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే సుభానీ మృతి చెందాడు. మృతుడు విజయవాడలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు తండ్రి దూదేకుల సైదు కాశిం తెలిపారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.